క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట



అర్తమూరులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం స్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామికి కానుకలు సమర్పించారు. వారికి శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, కన్వీనర్ కర్రి బాపిరెడ్డి, ఇతర నిర్వాహక కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ తోట మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన చేశారు. కార్యక్రమంలో గొలుగూరి అన్నపూర్ణ, మాజీ మండల వైస్ ఎంపీపీ గొలుగూరి విజయభాస్కరరెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి, ఎంపీటీసీ మండ సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, తేతలి రాజారెడ్డి, గొలుగూరి శ్రీనివాస్, తాడి రామారెడ్డి, తేతలి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు



కేదారిలంకలో కవాతు చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాల్లో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. మండపేట సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో అంగర ఎస్సై ఆంటి వరదేష ఆధ్వర్యంలో 90 మంది సాయుధ దళ సభ్యులు గ్రామ వీధుల్లో కవాతు చేశారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ప్రతి ఓటరు తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా సాయుధ బలగాలను కేంద్ర ఎన్నికల సంఘం సమకూర్చినట్టు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో చదివిద్దాం



ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయవరం: విద్యాభివృద్ధికి చిరునామాలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. రాయవరం మండలం లొల్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పూరు నాగిరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ప్రవేశాలకు ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. హెచ్ఎం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు బంగారు భవితను అందించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని కోరారు. విద్యార్థుల ప్రగతికి ప్రభుత్వ బడులు దిక్సూచిగా నిలుస్తాయని ప్రవేశాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో దివ్యాంగుల సదస్సు



సమావేశంలో చర్చిస్తున్న పోరాట సమితి నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 19న విజయవాడలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళి జయరాజు కోరారు. మండపేటలోని దివ్యాంగుల భవన్‌లో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ నబీ అధ్యక్షతలో నిర్వహించిన సదస్సు సన్నాహక సమావేశంలో జన సమీకరణపై చర్చించారు. నాయకులు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛను రూ.6వేలకు పెంచాలని, ఉచిత కరెంటు, ఉచిత గ్యాస్ సదుపాయాలను కల్పించాలన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సదస్సుకు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల సమితి ముఖ్య నాయకులు హాజరుకావాలని జయరాజు కోరారు. సమావేశంలో పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మేడిశెట్టి రాంబాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం
- రెండు నియోజకవర్గాల్లో హాజరుకానున్న 5,061 మంది విద్యార్థులు
- 94 పాఠశాలల విద్యార్థుల కోసం 29 కేంద్రాలు
- మండపేట నియోజకవర్గంలో 2,977 మంది
- రామచంద్రపురంలో 2,084 మంది



కపిలేశ్వరపురంలో పరీక్షల ఏర్పాట్లుపై చర్చిస్తున్న ఎంఈఓ తాతారావు తదితరులు

కపిలేశ్వరపురం: ఏడాది శ్రమ, సాధనలను నిరూపించుకునే సమయం ఆసన్నమైంది. బంగారు భవిష్యత్‌కు బాట వేసుకునే పరీక్షలు రానే వచ్చాయి. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరుతెన్నులపై ఈ కథనం..

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా..

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. 8.45 నుంచి 9.30 మధ్యలో పరీక్ష గదిలోకి అనుమతిస్తారు. మార్చి 18న తెలుగు, 19న సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), 20న ఇంగ్లిషు, 22న మ్యాథ్స్, 23న ఫిజిక్స్, 26న బయలాజికల్ సైన్స్, 27న సోషల్ స్టడీస్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించనున్నారు.

పరీక్షా కేంద్రాలిలా..

మండపేట మండలం, పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్, సెయింటన్స్ పాఠశాల, ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాల, తాపేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల, తాపేశ్వరం శ్రీచైతన్య ఉన్నత పాఠశాల. ద్వారపూడి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ద్వారపూడి జెడ్పీ బాలికోన్నత పాఠశాల మొత్తం 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురం మండలంలో అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకటి మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాయవరం మండలంలోని రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకటి మొత్తం మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండపేట నియోజకవర్గం మొత్తంలో 15 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలంలో 9, కె.గంగవరం మండలంలో 4 మొత్తం 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మాధ్యమాల వారీగా విద్యార్థులిలా...

మండపేట మండలంలోని 28 పాఠశాలలకు చెందిన 257 మంది తెలుగు మీడియం, 1,543 మంది ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాస్తున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని 10 పాఠశాలలకు చెందిన 203 మంది తెలుగు, 271 మంది ఇంగ్లిష్,

మండపేట నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులిలా..

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు	బాలికలు	బాలురు	మొత్తం
మండపేట	1,011	789	861	939	1,800
కపిలేశ్వరపురం	387	87	234	240	474
రాయవరం	432	271	369	334	703
మొత్తం	1,830	1,147	1,464	1,513	2,977

రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలంలో 1,626 మంది, కె.గంగవరం మండలంలో 458 మొత్తం 2,084 మంది పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం. కేంద్రాలు వద్ద వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పరీక్షా కేంద్రాల్లో మౌళిక సదుపాయాలన్నీ కల్పించాం. విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలు రాసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– కె.తాతారావు, ఎంఈఓ, కపిలేశ్వరపురం

రాయవరం మండలంలోని 13 పాఠశాలకు చెందిన 193 మంది తెలుగు, 510 మంది ఇంగ్లిష్ మీడియంలలో పరీక్షలు రాయనున్నారు. రామచంద్రపురం మండలంలోని 32 పాఠశాలలకు చెందిన 1626 మంది, కె.గంగవరం మండలంలోని 11 పాఠశాలలకు చెందిన 458 మంది పరీక్షలు రాస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగాలి. ఒత్తిడి, ఆందోళన విడనాడి, మానసిక ప్రశాంతతో పరీక్షలు రాయాలి. కోపతాపాలను కట్టడి చేసుకుని విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి. అనవసరమైన వాగ్వాదాలు, వివదాలు జోలికి వెళ్లడం విద్యార్థులకే నష్టం. కొత్త పాఠ్యాంశలు చదివే ప్రయత్నం మాని ఏ రోజుకా రోజు చదివినవి ఒకసారి పునశ్చరణ చేసుకోవడానికే పరిమితం కావాలి. వినోద, విహార సందర్శనలకు దూరంగా ఉండడమే మేలు. పక్షం రోజుల పాటు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్యున్ని సంప్రదించి తీవ్రత పెరగకుండా అప్రమత్తం కావాలి. చదవిన తర్వాత విశ్రాంతి అవసరమైనప్పుడు కుటుంబ సభ్యులతో ఆనందంగా మాట్లాడడం వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

సర్వం సిద్ధం

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం నుంచి పది పరీక్షలకు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాశాఖాధికారి వివేకానంద తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కోలంక, కాజులూరు, గొల్లపాలెం కేంద్రాలలో మొత్తం 710 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. నియమిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన లోనికి అనుమతించబడరన్నారు. విద్యార్థులకు సరిపడా బల్లలు, కుర్చీలు, తాగు నీటి వసతులు అన్నీ కేంద్రాల్లో సిద్ధం చేసి ఉంచామన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా పరీక్ష కేంద్రాల్లోని పరిశర గృహాలవారు సహకరించాలన్నారు. లౌడ్ స్పీకర్లు పెట్టడం, శబ్ద కాలుష్యం తలెత్తేలా శబ్దాలు చేయకూడదన్నారు.

విద్యార్థులు బస్సు ఎక్కడ ఆపినా ఆపాలి

రామచంద్రపురం రూరల్: నేటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా వారు ఎక్కడ బస్సు ఆపినా ఎక్కించుకోవాలని డ్రైవర్లకు, అదే విధంగా వారి హాల్ టికెట్‌పై ఇంటి వద్ద నుంచి పరీక్ష కేంద్రానికి, పరీక్ష కేంద్రం నుంచి ఇంటి వద్దకు వారికి ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కండక్టర్లకు సూచిస్తూ రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్థులు ఈ మేరకు సహకరించాలని ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు.

మంచినీళ్లు ఎలా పట్టుకోవాలో..



ద్రాక్షారామలో మంచినీరు పట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్న స్థానికుడు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం–ద్రాక్షారామ ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా ద్రాక్షారామలో మంచినీటి కుళాయి గొట్టను ఆర్ అండ్ బీ కాంట్రాక్టర్ జేసీబీతో తొలగించారు. దీంతో ఇక్కడ మంచినీరు పట్టుకునే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మళ్లీ ఈ కుళాయిని గొట్టను నిర్మించాలని కోరుతున్నారు.

కోడ్ కూసింది.. ముసుగుపడింది

తొలగించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు



రామచంద్రపురం బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు



కోడ్ రావటంతో మూత పడిన విగ్రహాలు



కోడ్ రావటంతో ఫ్లెక్సీలు తొలగించిన విద్యుత్ స్తంభాలు

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ వెలువడటంతో శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు రంగంలోకి దిగారు. డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రధాన రహదారులు, రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలను పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ప్రభుత్వ సిబ్బంది శనివారం రాత్రి నుంచి తొలగించే పనిలో పడ్డారు. ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులను శనివారం రాత్రి నుంచే ఏర్పాటు చేసి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రామచంద్రపురం ఆర్డీవో, ఎన్నికల అధికారి ఎస్.సుధాసాగర్ నేతృత్వంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డీఎస్పీ బి.రామకృష్ణ, రామచంద్రపురం సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్ నేతృత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే రామచంద్రపురం బైపాస్ రోడ్డులోని బోడవరం సెంటర్ వద్ద ప్రధాన చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. దీంతో పాటుగా అక్రమ మద్యం నియోజకవర్గంలోకి రాకుండా ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. యానాం బోర్డర్‌లోని కాజులూరు, కె.గంగవరం మండలాలకు చెందిన గ్రామాల వద్ద కూడా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ఇంకా 60 రోజుల సమయం ఉండటంతో ఇప్పటివరకు ఈ చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామ, కె.గంగవరం, రామచంద్రపురం టౌన్, గొల్లపాలెం, కాజులూరు గ్రామాల్లో ప్రభుత్వ స్తంభాలకు ఇప్పటివరకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించటంతో రోడ్లు విశాలంగా మారాయి. దీంతో పాటుగా ప్రైవేటు భవనాల మీద ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద హోర్డింగ్ లను కూడా అధికార సిబ్బంది తొలగించారు.

ప్రమాదాల నివారణకే ట్రాఫిక్ నిబంధనలు

కాజులూరు: రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకే రక్షణగా ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తూ ఉంటుందని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.డేవిడ్ అన్నారు. ఆదివారం గ్రామంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఎస్సై డేవిడ్ స్టేషన్ సిబ్బందితో నాకాబందీ నిర్వహించి డ్రైవర్లకు సక్రమముగా లేని పలు లారీలు, ట్రాక్టర్లు, కార్లు, మోటారుసైకిళ్ల తదితర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రయాణికులకు ఎస్సై డేవిడ్ పలు సూచనలు చేశారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



సోమేశ్వరం సమావేశంలో యువ నేత పృథ్వీరాజ్

రాయవరం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరంలో ఆదివారం రాత్రి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ప్రతి పేదవాడికి, రైతులకు, మహిళలకు చేసిన మేలును వివరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రక అవసరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు బంగారు ఏసు, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర రామచరెడ్డి, ఎంపీటీసీ కళ్ల అప్పారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్ ను పృథ్వీరాజ్ కట్ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గారగ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు నున్న వెంకటరమణ, గగర కామరాజు, నాగదేవర తాతాజీ, కోట వెంకట్రావు, రాకుర్తి సుబ్బారావు, ఇంకో ప్రకాష్, నున్న గోపాలకృష్ణ, శాకా అమ్మిరాజు, గుత్తి భద్ర రావు, గుత్తి సూర్య భాస్కర రావు పాల్గొన్నారు.

వంచించిన వారు కూటమి కట్టారు..



మండపేటలో మాట్లాడుతున్న గౌతమ్

కపిలేశ్వరపురం: దేశ ప్రజలను వంచించిన వారు కూటమిగా ముందుకు వస్తున్నారని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారిని ఓడించాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ కోరారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. మండపేటలో కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం గౌతమ్ విలేకరులతో మాట్లాడారు. పలు అంశాలపై డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు తదితరులు మాట్లాడారు. గౌతమ్ మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, వైఎస్సార్ సీపీలు రాష్ట్రానికి ప్రత్యామ్నాయం కాదన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమం పేరుతో పంపిణీ చేస్తున్న సొమ్ము ప్రభుత్వానిదన్నారు. వైఎస్సార్ ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టును పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 2018లో బీజేపీ నుంచి విడిపోయిన చంద్రబాబు నేడు ఏ ముఖం పెట్టుకుని మోదీ కాళ్ల మీద పడ్డారని ప్రశ్నించారు. పెళ్లి కాని వాడికి, సమస్త ద్రోహికి దేశాన్ని పాలించే అర్హత లేదంటూ ప్రధాని మోదీపై వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకొని నేటి ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ప్రశ్నించారు. కామన ప్రభాకరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని ఓడించాలని అవసరాన్ని ఓటర్లు గుర్తించాలన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మావదాసు శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

రాయవరం: స్థానిక పాలప్రాంగణంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి, ఆండాళ్ సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గోవింద మాలలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు వాడపల్లి కమలనాభాచార్యులు, ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో గోవిందమాలలు ధరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుహోమం, బలిహరణ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణ మధ్య నిర్వహించారు. అనంతరం పుర వీధుల్లో గోవింద మాలధారులు స్వామివారిని తిరుప్పు వాహనంపై మేళతాళాలతో, బాణ ఫణాంగ్రిలతో ఊరేగించారు. రాత్రికి స్వామి వారికి పెద్ద శేష వాహనోత్సవాన్ని నిర్వహించారు.

పోషకాల గని పుచ్చ



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

అంబాజీపేట: వేసవి వచ్చిందంటే చాలు. ప్రజల దాహార్తిని తీర్చుస్తూ ఎన్నో పోషక విలువలు మానవ శరీరానికి అందించడంలో పుచ్చకాయ కు ద్వితీయస్థాన పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయ పుట్టిల్లు దక్షిణాఫ్రికా. అమెరికాకు పుచ్చకాయ 17వ శతాబ్దంలో పరిచయం అయింది. పుచ్చకాయల్లో సుమారు 1203 రకాలు ఉన్నాయి. ఎక్కువగా ఎరుపు రంగులో ఉన్నప్పటికీ ప్రస్తుతం పసుపు, పాల పసుపు, నారింజ తదితర రంగుల్లో కూడా లభ్యమవుతున్నాయి. కొవ్వు శాతం తక్కువ ఉన్న పుచ్చకాయలో చాలా మంది ఎర్రటి గుజ్జును మాత్రమే తింటారు. కాని శాస్త్రవేత్తల ప్రకారం ఎర్రటి గుజ్జు కింద ఉండే తెల్లని గుజ్జులో కూడా ఎన్నో పోషకాలున్నాయని చెబుతున్నారు. 100 గ్రాముల పుచ్చకాయ గుజ్జులో శక్తి 130 కిలో క్యాలరీలు ఉంటాయి. పిండి పదార్థాలు 7.5 గ్రాములు, పీచు పదార్థాలు 0.4 గ్రాములు, ప్రొటీన్లు 0.6 గ్రాములు నీరు 91.5 శాతం, విటమిన్ 3 శాతం, విటమిన్-సి 8.1 మిల్లీ గ్రాములు, కాల్షియం 7 మిల్లీ గ్రాములు, ఐరన్ 0.24 మిల్లీ గ్రాములు, మెగ్నీషియం 10 మిల్లీగ్రాములు, పాస్పరస్ 11 మిల్లీగ్రాములు, పొటాషియం 112 మిల్లీగ్రాములు, జింక్ 0.1 మిల్లీ గ్రాములు ఉన్నాయి. చాలా మంది పుచ్చకాయ గింజల్లోను పోషకాలు ఎన్నో ఉన్నాయి. పుచ్చకాయ గింజలను ఎండబెట్టి పొడి రూపంలో తీస్తే శరీరానికి ఎంతో మంచిది. కొన్ని దేశాల్లో పుచ్చ గింజల నుంచి నూనె తీస్తారు. పుచ్చకాయలో సెట్రులిన్ అనే ఫైటో న్యూట్రియంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న అర్జి ఎంజైములతో కలిసి ఆర్జనైన్ అనే అమినో ఆమ్లంగా మారుతుంది. దీని వల్ల గుండె పనితీరు, రక్త ప్రసరణ మెరుగుపడటం, రోగ నిరోధక శక్తి పెరగటం జరుగుతుంది. పుచ్చకాయల్లో సుగర్ బేబీ, ఆసాయి యమటో, జర్కుక్స్ తీ, అర్కా మానిక్, దుర్గాపూర్ కేసర్, మీరా, మధుర, పుప్లీత్, అపూర్వ, స్వీట్ డ్రాగన్, మహారాజా, నేత్రావతి, మాధురి తదితర రకాలున్నాయి. పుచ్చకాయ సాగుకు 23 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. నదీ పరివాహక ప్రాంతాలు, ఇసుక తిన్నెలు, బంక మట్టి నేలలు మురుగు వసతి కలిగిన ఒండ్రు మట్టి నేలలో సాగు చేపడుతున్నారు.

హోమియో సేవలకు అంతరాయం

- వైద్యులు లేక రోగుల ఇబ్బందులు
- డాక్టర్‌ను నియమించాలని విన్నపం



ద్రాక్షారామ హోమియో వైద్యశాల

రామచంద్రపురం రూరల్: 37 ఏళ్లుగా ద్రాక్షారామలో కొనసాగుతున్న హోమియో వైద్యం ప్రస్తుతం నిలిచిపోయింది. 1968లో శేక్ బన్సీలాల్ సమ్మిద్ దాతృత్వంలో కట్టించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం ఆవరణంలో 1987లో ప్రభుత్వ హోమియో వైద్యశాలగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ద్రాక్షారామతో పాటు 50కి పైగా ద్రాక్షారామ పరిసర గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడి హోమియో వైద్య సేవలు పొందుతున్నారు. ద్రాక్షారామ-కోటిపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఆసుపత్రికి ద్రాక్షారామంలో సంత రోజైన సోమవారం వచ్చే రోగుల సంఖ్య 100 నుంచి 120 వరకు ఉంటుంది. ఆదే విధంగా మిగిలిన రోజుల్లో 50 మందికి పైగా వైద్య సేవలు కోసం వస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న హోమియో వైద్యాధికారి డాక్టర్ ఎం.విజయ ప్రతిభ మూడు నెలల క్రితం కోరంగి హోమియో ఆసుపత్రి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌గా అభివృద్ధి చేయడంతో అక్కడికి డిప్యుటేషన్‌పై పూర్తి స్థాయిలో అక్కడే ఉండి పనిచేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ద్రాక్షారామలో రోగులు వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. అయితే 37 ఏళ్లుగా అలవాటుపడ్డ హోమియో వైద్యం కోసం వెంటాడు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వారంలో మూడు రోజులైనా హోమియో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

27 ఏళ్లుగా వైద్య సేవలు పొందుతున్నాం



గత 27 ఏళ్లగా నేను, నా కుటుంబ సభ్యులు ఈ ఆసుపత్రిలో హోమియో వైద్యసేవలు పొందుతున్నాం. అనేక మంది పేదలు, వృద్ధులు ఇక్కడ వైద్యం కోసం వస్తుంటారు. హోమియో వైద్యంలో చక్కని ఫలితం కనిపిస్తుండటంతో పాటు ఈ మందులకు సైడ్ ఎఫెక్టులు ఉండవు. అందువల్ల హోమియో వైద్యులను నియమించాలి.

– సత్తి సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త, తోటపేట

హోమియో డాక్టర్లను నియమించాలి



ద్రాక్షారామ హోమియో ఆసుపత్రికి ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. ప్రయాణ సౌకర్యాలు ఉండటంతో ద్రాక్షారామ పరిసర గ్రామాల నుంచి వైద్య సేవల కోసం ప్రజలు వస్తుంటారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన డాక్టర్ ఇక్కడ ఎఫ్ఎన్ఓగా పనిచేస్తున్న అమ్మాజీ పాత వారికి మందులను ఇస్తున్నారు. కొత్తవారు ఎవరైనా వస్తుంటే వెంటా వెళ్లాలని సూచిస్తున్నారు. ఇక్కడ హోమియో వైద్యానికి ఉన్న ఆదరణ దృష్ట్యా వెంటనే హోమియో వైద్యులను నియమించాల్సి ఉంది.

– నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, ద్రాక్షారామ